

ట్యాంకర్ల ద్వారా మట్టి కాలువలోకి వదులుతున్న విష రసాయనాలు

అర్ధరాత్రి వస్తూ.. విష రసాయనాలు పారబోస్తూ..

- గగన్‌పహాడ్ పరిసర ప్రాంతాల్లో డంప్ చేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలు
- ఘాటైన వాసనతో రోగాల బారిన ప్రజలు
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- మామూళ్ల మత్తులో అధికారులు, పోలీసులు?



మైలార్‌దేవ్‌పల్లి: అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వివిధ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, రసాయనాలను కాలనీలు, బస్తీల్లో వదులుతుండటంతో రోగాలబారిన పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని గగన్ పహాడ్ పరిసర ప్రాంతంలో జీడిమెట్ల, బొల్లారం, పటాన్‌చెరు కాటేదాన్ ఇండస్ట్రీ ప్రాంతాలలో ఉన్న భారీ పరిశ్రమల నుంచి ప్రమాదకరమైన రసాయనాలను ట్యాంకర్ల ద్వారా ఖాళీ ప్రదేశాలలో డంపింగ్ చేస్తున్నారు. ఒక్క ట్యాంకర్ నుంచి వదిలిన రసాయానాల ఘాటైన వాసన దాదాపు 8 కిలో మీటర్ల మేరకు వస్తుంది. ఆ ప్రాంతాలలో బోర్లు వేసిన కలుషితమైన నీరు వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ ట్యాంకర్ల ద్వారా వదులుతున్న రసాయనాలు సమీపంలోని అప్పచెరవు, మామిడికుంట చెరువు, పెద్ద చెరువుల్లో చేరుతున్నాయి. మేతకోసం వచ్చే పశువులు ఆ కలుషితమైన నీటిని తాగి మృత్యువాత పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో ట్యాంకర్లను దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి మట్టి కాలువలో కలుపుతున్నారు. ఇందులో కొందరు స్థానిక పార్టీ నాయకులను అండతో అర్ధరాత్రి సమయాలలో భారీ ట్యాంకర్ల ద్వారా వ్యర్థాలను వదులుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది యువకులు ప్రశ్నిస్తే బడాబాబులు కేసులు పెట్టిస్తునట్లు చెబుతున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు పోలీసులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇటీవల రెండు ట్యాంకర్ల ద్వారా మట్టి కాలువలో పోస్తున్న సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మాముళ్లతో సరిపెట్టుకుని వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాల ద్వారా ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్నారులు, వృద్ధులను రోజూ ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ట్యాంక్లరు వచ్చినప్పుడు ప్రశ్నించడానికి వెళ్తే దాడులకు సైతం దిగేందుకు సిద్ధంగా ఉంటారని పలువురు యువకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రసాయనాలను వదులుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లారీని పట్టించిన స్థానికులు..

శంషాబాద్: నాలుగు రోజుల క్రితం రసాయనాలు పారబోస్తున్న లారీని గగన్‌పహాడ్ వాసులు 100 డయల్‌కు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీతో పాటు సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని స్థానికులు శుక్రవారం మీడియాతో పేర్కొన్నారు. అయితే.. లారీకి సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



పరిశ్రమల నుంచి వెలువడే ప్రమాదకర రసాయనాలను గగన్‌పహాడ్ ప్రాంతంలో కొన్ని ఏళ్లుగా డంప్ చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి మట్టి కాలువలో పోస్తున్నారు. ఆ ట్యాంకర్ల నుంచి వ్యర్థాలను వదిలేటప్పుడు ఘాటైన దుర్వాసన వస్తుంది. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి డంప్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

–నూరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి, గగన్‌పహాడ్

సంఘం బలోపేతానికి కృషి


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం రాత్రి సంధ్యానగర్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా టి.రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఈ.విజయ్‌కుమార్, పి.రమేష్, ఆర్.మల్లేష్, ప్రధాన కార్యదర్శులుగా కె.లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శిగా కె.సత్యనారాయణ, సమాచార కార్యదర్శిగా బి.బాబురావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.జగదీశ్వర్, కోశాధికారిగా ఎస్.విఠలయ్య, కార్యదర్శులుగా ఏ.సాయికాంత్, ఎం.సతీష్, జి.కృష్ణయ్య, జి.నగేష్, బి.రమేష్, సలహాదారులుగా కె.సత్యనారాయణ, ఏ.శ్రీశైలం, బి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా టి.నర్సింహులు, ఎస్.కృష్ణ, డి.బాలకృష్ణ, కె.అనిల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. గత కమిటీ ఆధ్వర్యంలో సంఘం బలోపేతం కోసం కలిసికట్టుగా కృషి చేశామన్నారు. కుల సోదరులంతా మరోసారి తమకు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కమిటీతో పాటు కులస్తులందరి సహాయ సహకారాలు సూచనలు పాటిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.

సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్ది, ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ..త్వరలో కాలనీలో సర్కిల్ అధికారులతో పర్యటిస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నానని కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకొచ్చి అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అడికె రాజు, నర్సింగ్, బాన్సింగ్ , రఘుపతి, రాధాక్రిష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

క్షతగాత్రులను 'నిమ్స్'కు తరలింపు

శంషాబాద్: ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని పట్టణంలోని సన్‌రైజ్ ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి సూచనల మేరకు వారికి నిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. దీక్షితతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించి నోటీసులు అందజేశారు. పట్టణంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో బాధితుల నుంచి అధిక బిల్లులు వసూలు చేయడంపై వాగ్వాదం చోటు చేసుకుంది.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నరేందర్

శంషాబాద్: పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు జల్లపల్లి నరేందర్ తన తల్లి పేరిట జేవైఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెలరోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. క్రీడలు ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేస్తాయన్నారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 22 వేల రివార్డును అందజేశారు.

చికిత్సలో నూతన విధానం అవసరం

- రోగి మానసిక ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించాలి
- కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు వీరేందర్, మాలిక్

రాయదుర్గం: రోగి మానసిక ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించడంతో బాటు చికిత్సలో నూతన విధానాలు అమలు చేయాలని కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మాలిక్‌సింగరాజు, డాక్టర్ వీరేందర్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్, హెచ్‌సీయూ సైన్స్ గురుస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన 'డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ వినియోగం కూడా అవసరమని, కానీ దాని వల్ల ఏర్పడే లాభనష్టాలను బేరీజు వేసుకోవాలన్నారు. వైద్యాధికారులు సునీల్, డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ ఔషద ఆవిష్కరణలో ఏఐ యొక్క క్లిష్టమైన అంచనాపై వారు వివరించారు. ఏఐ డేటా ప్రమాదాలను పరిష్కరించడానికి , డేటా సమగ్రతను నిర్ధారించడానికి మానవ పర్యవేక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో ఐఈఎఫ్ఆర్, రెజీన్ ప్రతినిధి డాక్టర్ ఉదయ్ సక్సేనా, ఫెడరేషన్ ఆఫ్ ఆసియా బయోటెక్ అసోసియేషన్స్ సెక్రటరీ జనరల్ డాక్టర్ పి రత్నాకర్, నేషన్ బయో ఫార్మా మిషన్ ప్రతినిధి డాక్టర్ రాజ్‌షిర్ముల్లా, డాక్టర్ బీవీఎస్ సునీల్ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అత్తాపూర్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న పలువురిని అరెస్ట్ చేసిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నిమ్మల వెంకన్న వివరాల ప్రకారం...పీవీ నర్సింహారావు ఎలివెటెడ్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 161 వద్ద శుక్రవారం గంజాయి విక్రయిస్తున్నారే సమాచారంతో పోలీసులు వెళ్లి తనిఖీలు చేపట్టగా గంజాయి విక్రయించేందుకు పాల్పడుతున్న ఇంతియాజ్ తప్పించుకోగా హైమద్ షేక్(53) షేక్ షకీల్(38) ను అదుపులోకి తీసుకుని రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కడుపు నొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య

రాజేంద్రనగర్: కడుపు నొప్పి భరించలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలిక (17) ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం తల్లి పనికి వెళ్లగా మరో సోదరి కళాశాలకు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్యంతో ఉన్న తన స్నేహితురాలిని చూసేందుకు తోటి కళాశాల స్నేహితులు ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించడంతో స్థానికులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

స్థానికేతరుల సెలూన్‌లకు అనుమతులు ఇవ్వొద్దు


మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: అనాదిగా స్థానంగా ఉంటూ గ్రామస్థుల అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూ సెలూన్‌లను నడుపుకుంటున్న నాయీ బ్రాహ్మణుల పొట్ట కొట్టేలా వివిధ పేర్లతో సెలూన్‌లు వెలుస్తున్నాయని, వాటికి అనుమతులను జారీ చేయవద్దని మణికొండ మున్సిపాలిటీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్.శ్రీనివాస్, నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కొత్తగా సెలూన్‌లు ఏర్పాటుకు 500 అడుగుల దూరం ఉండాలనే నిబంధన ఉందని వాటిని పాటించకుండా ఇష్టారాజ్యంగా పలు బ్రాండెడ్ సంస్థలు సెలూన్‌లు ఏర్పాటు చేసి తమ పొట్ట కొడుతున్నారన్నారు. అలాంటి వాటికి ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయవద్దని మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో బాబురావు, శ్రీకాంత్, భరత్, పురుషోత్తం, కిరణ్ కుమార్ ఉన్నారు.

ముదిరాజ్ భవన్ పనులు త్వరగా పూర్తి చేయాలి


స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న దుర్గేష్‌యాదవ్

మణికొండ: కోకాపేటలో నిర్మాణంలో ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీహాల్ భవన్ పనులను త్వరగా పూర్తిచేసి వారికి అందుబాటులోకి తేవాలని నార్సింగి మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ ఎ.దుర్గేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మొదటి అంతస్తు స్లాబ్ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రూ.2 కోట్ల మున్సిపల్ నిధులతో అన్ని హంగులతో ముదిరాజ్ భవన్‌ను నిర్మిస్తున్నామన్నారు. కోకాపేటలో అనాదిగా అన్ని కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్లు ఉన్నాయన్నారు. ముదిరాజ్‌లకు సరైన భవనం లేకపోవటంతో దాని స్థానంలో నూతనంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

లింకురోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జోనల్ కమిషనర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజా అవసరాల మేరకు లింకు రోడ్లు అభివృద్ధి చేశారని, పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన పనులు, పెండింగ్ పనులపై ఆయన జెడ్సీతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. శేరిలింగంపల్లి అభివృద్ధికి కావాల్సిన నిధులను సీఎంతో మాట్లాడి మంజూరు చేయిస్తామన్నారు. గంగారం హనుమాన్ ఆలయం ప్రధాన రహదారి నుంచి అపర్ణ వరకు లింకురోడ్డు, శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఇక వర్షాకాలం దృష్ట్యా రోడ్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేసేలా చూడాలని ఎమ్మెల్యే జెడ్సీకి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మణికొండ: ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించటంతో మహిళలు అల్లికలు, రికార్డింగ్ డ్యాన్స్‌లకు ఉపయోగించుకుంటున్నారన్న ఎమ్మెల్యే కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జితేందర్ కిరణ్‌కుమార్, సాయిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎపుడూ లేని విధంగా మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించటంతో ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. దినసరి కూలీలతో పాటు ప్రైవేటు ఉద్యోగాలు, విద్యార్థులు, మహిళలు గర్వంగా బస్సులలో ప్రయాణిస్తున్నారన్నారు. అంతమంచి పథకాన్ని విమర్శించాలనే అక్కసుతో మహిళలు రికార్డింగ్ డ్యాన్స్‌లు చేస్తున్నారని వారిని కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ డి. పురుషోత్తం, నాయకులు బి. ముత్యాలు, తాజుద్దీన్, రవికాంత్, కస్తూరి సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందిన ఏఈ పి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సన్‌సిటీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వదరకు హిమగిరినగర్, గంధంగూడ, వెస్టెండ్‌కాలనీ, శాంతినగర్, లక్ష్మినగర్, హైదర్షాకోట్ తదితర ప్రాంతాలు. మిలట్రీ–2 ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మపెల్ టౌన్, విశ్వాస్‌నగర్, స్పెషల్ బ్లాక్, బి–బ్లాక్, సన్‌సిటీ మెయిన్ గేటు. పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో 12.30 నుంచి ఒంటి గంట వరకు పీఅండ్‌టీ కాలనీ, ఏ,బీ,సీ,డీ, స్పెషల్ బ్లాక్స్, సన్‌సిటీ. కాళీమందిర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు ఆదర్శనగర్, బైరాగిగూడ, భవానీ కాలనీ, గంధంగూడ, హిమగిరి కాలనీ, హైదర్షాకోట్, జెఎల్ఎన్ఎస్ కాలనీ, కపిలానగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీ, సన్‌సిటీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఖబ్రస్థాన్‌కు ఐదెకరాల భూమి కేటాయింపు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జనాభాకు అనుగుణంగా శ్మశానవాటిక లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సిఫారసు మేరకు ఐదెకరాల భూమిని కేటాయించారు. మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 44లో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించినట్టు జిల్లా కలెక్టర్ ఓ ఉత్తర్వులో పేర్కొన్నారు. ముస్లింల సమస్యను దృష్టిలో ఉంచుకుని స్థానిక సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గతంలో ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని కౌన్సిల్ అధ్యక్షుడు సీతారం తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఐదెకరాల భూమిని కేటాయిస్తూ వెలువడిన ఉత్తర్వులను తమకు అందజేశారన్నారు. సదరు భూమి విషయంలో గతంలో వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ శాఖల మధ్య వివాదం ఉంది. అదే భూమిని శ్మశానవాటికకు కేటాయించటంతో వివాదం సద్దుమనిగిందని స్థానికులు పేర్కొన్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో శుక్రవారం బీజేపీ నాయకులు మాజీ ప్రధాని, దివంగత నేత అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను ఎప్పటికి మరువలేమన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొమరయ్య, సుధాకర్, రాజశేఖర్, కిరణ్‌చారి, వెంకటేష్, కృష్ణ, రమేష్, సిద్దేశ్వర్, నర్సింహ, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


టైర్లలో ఉన్న నీటిని పారబోయిస్తున్న కమిషనర్

బండ్లగూడ: దోమల వృద్ధిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో భాగంగా 11,16,19 డివిజన్‌లలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అస్లాంబిన్ అబ్దుల్లా, కోఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, నాయకులు నాగుల నరేందర్, డీసీపీ సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, వార్డు ఆఫీసర్లు సైదులు, మహిపాల్‌రెడ్డి, శానిటరీ జవాన్లు మల్లేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

దేవాలయాన్ని పునర్నిర్మిద్దాం


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని శివాలయ, సీతారామాంజనేయస్వామి దేవాలయాన్ని పునఃనిర్మాణం చేయాలని కమిటీ నాయకులు తీర్మానించారు. అనాదిగా ఉన్న దేవాలయం శిథిలావస్థకు చేరడం, దేవాలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా లేకపోవటంతో దాన్ని తొలగించి నూతనంగా నిర్మించాలని చిదంబరేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన ఆర్థిక సహాయం గ్రామ ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్తులంతా ఇవ్వాలని నిర్ణయించారు.

అదనపు అంతస్తు కూల్చివేత



మణికొండ: అనుమతులకు మించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మణికొండ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జనచైతన్య లేఅవుట్‌లో అనుమతుల మించి నిర్మించిన ఓ భవనంలోని రెండు స్లాబులను శుక్రవారం కూల్చివేశారు. ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణాల సమయంలో తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

శంషాబాద్: బాలికను గర్భవతిని చేసిన కేసులో నిందితులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్, రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పరారీలో ఉన్న వైద్యులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు నిర్వహించే వరలక్ష్మి వ్రత వేడుకలను రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వైభవంగా నిర్వహించారు. ఆయా పరిధుల్లోని అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కొందరు ఇళ్లలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–రాజేంద్రనగర్ జోన్ బృందం


మణికొండలో అమ్మవారికి పూజ చేస్తున్న శిరీష




మణికొండ శివాజీనగర్‌లో ..


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఓ కుటుంబం


వరలక్ష్మీవ్రతం నిర్వహించిన నార్సింగి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి


ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న దంపతులు


వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పూజలు నిర్వహిసన్నున్న మహిళలు


నార్సింగిలో..